ఖరీఫ్ సాగుకు కర్షకుల సమాయత్తం

- ముందస్తు వర్షాలతో అన్నదాతల మోములో ఆనందం
- పంట పొలాలను సాగుకు సిద్ధం చేసుకుంటున్న రైతన్నలు
- మరో వారంలో రుతుపవనాలు ప్రవేశిస్తాయని తెలియటంతో దుక్కు దున్నే పనిలో నిమగ్నం



పంట పొలాన్ని సాగుకు సిద్ధం చేస్తున్న పనిలో రైతన్నలు

భట్టిప్రోలు: ఈ ఏడాది తొలకరి జల్లులు ముందుగానే పలుకరించడంతో అన్నదాతల మోములో ఆనందం వెల్లివిరుస్తుంది. వాతావరణం పూర్తిగా చల్లబడి వ్యవసాయానికి అనుకూలంగా మారడంతో రైతులు ఖరీఫ్ సాగు దిశగా అడుగులు వేసేందుకు సమాయత్తమయ్యారు. ఏటా ఖరీఫ్ సీజన్ పనులను జూన్ నెలలో ప్రారంభించేవారు. గత ఐదారేళ్లుగా వర్షాభావ పరిస్థితులు, కాల్వల ద్వారా సకాలంలో సాగు నీరు రాక జూలై మాసంలో పనులు ప్రారంభించేవారు. దీనికి భిన్నంగా ఈ ఏడాది ముందస్తు వర్షాలకు ఖరీఫ్ సాగుకు జూన్‌లోనే రైతులు సిద్ధమవుతున్నారు. రెండు మూడు రోజులలో ఋతు పవనాలు కూడా వస్తున్నాయన్న తీపి కబురుతో రైతుల మోముల్లో హర్షాతిరేఖాలు వ్యక్తమౌతున్నాయి.

నకిలీ విత్తనాలు, ఎరువులతో మోసపోవద్దు

వాతావరణం చల్లబడటంతో సాగుకు పంట పొలాలను సిద్ధం చేసుకునే పనిలో కర్షకులు నిమగ్నమయ్యారు. వేమూరు నియోజక వర్గంలోని 5 మండలాలలోని 89 గ్రామాలలో ఖరీఫ్ పంటగా వరిని సాగు చేస్తున్నారు. మాగాణి భూములను తొలి విడత దుక్కులు దున్నిన అన్నదాతలు నారుమళ్ల పనిలో నిమగ్నమయ్యారు. భట్టిప్రోలు మండలంలో 15వేల ఎకరాల్లో వరి సాగు చేస్తున్నారు. 1064, బీపీటీ 5204, 2077, 1001 తదితర రకాల వరి విత్తనాలతో రైతులు సాగు చేపడుతున్నారు. మండలంలో వరి విత్తనాలు 300 టన్నులు అవసరం ఉందని వ్యవసాయశాఖాధికారుల అంచనా. ఇప్పటికే ఖరీఫ్ సాగుకు సిద్ధమైన రైతులు విత్తనాలు, ఎరువులను కొనుగోలు చేసేందుకు అవసరమైన పెట్టుబడులను సిద్ధం చేసుకుంటున్నారు. భూసారానికి గానూ రైతులు పొలాలలో పచ్చిరొట్ట పైరులు సాగుచేస్తున్నారు. పచ్చిరొట్ట ఎరువులకు సంబంధించి విత్తనాలను ప్రస్తుతం సబ్సిడీపై వ్యవసాయశాఖ అందిస్తుంది. ఇది ఇలా ఉండగా నకిలీ విత్తనాలు, ఎరువులతో అన్నదాతలు మోసపోవద్దని, తమ కొనుగోళ్లకు సంబంధించి తప్పని సరిగా రసీదులు పొందాలని వ్యవసాయశాఖ అధికారులు రైతులకు సూచిస్తున్నారు. ఖరీఫ్‌లో రైతులు పెరిగిన ఎరువుల ధరలతో సాగుచేయడమెలా అంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం మార్కెట్‌లో యూరియా ధర రూ.300, డీఏపీ రూ.1350, పోటాష్ రూ.1650, 20:20 రూ.1100 పలుకుతోంది.



మెట్ట భూమిలో దుక్కు దున్నుతున్న అన్నదాత

పచ్చిరొట్ట సాగు.. దిగుబడి బాగు

భట్టిప్రోలు: క్రిమి సంహారక మందులు, రసాయనిక ఎరువులు వ్యవసాయ భూములకు అందించటం వలన సారవంతమైన భూములు గుల్లబారిపోతున్నాయి. అధిక దిగుబడులు సాధించడానికి రైతులు పంటలకు విచ్చల విడిగా రసాయనిక ఎరువులు అందిస్తున్నారు. దీంతో భూమిలో పోషక విలువలు తగ్గి దిగుబడులు తగ్గిపోతున్నాయి. పురాతన పద్ధతిలో సాగు చేసిన విధంగా సేంద్రియ ఎరువులతో సాగు చేసేందుకు రైతులు దృష్టి పెడుతున్నారు. పచ్చిరొట్ట ఎరువులతో భూమికి ఎన్నో ప్రయోజనాలు కలుగుతాయని వ్యవసాయ శాస్త్రవేత్తలు చెబుతుండటంతో రైతులు ఆ దిశగా పచ్చిరొట్ట ఎరువులను తమ భూములకు అందిస్తున్నారు. ఇందుకు గానూ ప్రభుత్వం 50 శాతం సబ్సిడీపై జీలుగ, పిల్లిపెసర, జనుము లాంటి విత్తనాలను రైతులకు అందిస్తుంది. ఈ పైర్లను పూత దశ వరకు పెంచి భూమిలో కలియ దున్ని పచ్చిరొట్టగా వినియోగిస్తున్నారు. పచ్చిరొట్ట పైరును భూమిలో కలియదున్నడం వల్ల ఆకుల్లో నత్రజని ఎక్కువగా ఉంటుంది. పచ్చిరొట్ట ఎరువు వలన నేలలో గాలి ప్రసరణ జరిగి భూమిలో వేడిని క్రమబద్ధం చేస్తుంది. గత ఏడాది మండలంలో అన్నిరకాల పచ్చిరొట్ట విత్తనాలు కలిపి 70 క్వింటాళ్లు విక్రయించారు. ఈ ఏడాది 100 క్వింటాళ్లకు ఇండెంట్ పెట్టారు. రైతులు అడిగిన వెంటనే పచ్చిరొట్ట విత్తనాలు సరఫరా చేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది.

ఆర్బీకేల ద్వారా అవగాహన

..రాష్ట్ర ప్రభుత్వం సేంద్రీయ సాగును ప్రోత్సహిస్తుంది. అందుకు అనుగుణంగా ఇప్పటికే ఆర్బీకేల ద్వారా వ్యవసాయాధికారులు రైతులతో సమావేశాలు ఏర్పాటు చేసి పచ్చి రొట్ట ఎరువుపై అవగాహన కల్పిస్తున్నారు. పచ్చిరొట్ట ఎరువు సాగు, కలిగే ప్రయోజనాలను రైతులకు వివరిస్తున్నారు. ఖరీఫ్‌లో వాతావరణ పరిస్థితులు సానుకూలంగా ఉండటంతో రైతులను సాగుకు సన్నద్ధం చేసేందుకు వ్యవసాయాధికారులు సిద్ధమవుతున్నారు. వరి విత్తనాలతో పాటు ఎరువులు రైతులకు అందుబాటులో ఉంచుతున్నట్లు తెలిపారు.

రాయితీపై పచ్చిరొట్ట విత్తనాలు



రాయితీపై జీలుగ, పిల్లిపెసర, జనుము విత్తనాలను సరఫరా చేస్తున్నాం. పచ్చిరొట్ట సాగుతో భూమి భౌతిక స్వరూపం మెరుగుపడటం, వానపాములు వృద్ధి చెంది రైతులకు మేలు చేస్తాయి. రసాయన ఎరువుల వాడకం గణనీయంగా తగ్గుతుంది. పచ్చిరొట్ట పైర్లు పూత దశలో ఉండగా దమ్ము చేస్తే ఎక్కువ ప్రయోజనం కలుగుతుంది. ప్రతి పొలంలో కనీసం రెండేళ్లకు ఒక్క సారైన పచ్చిరొట్ట పైర్లు సాగు చేపట్టాలి.

–గొల్లపోతు మీరయ్య,
వ్యవసాయాధికారి, భట్టిప్రోలు.

క్లుప్తంగా

వైభవంగా వేంకటేశ్వరుని బ్రహ్మోత్సవాలు



నగరం: స్థానిక వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేద పండితుల మంత్రోచ్ఛరణల నడుమ అత్యంత వైభవంగా బ్రహ్మోత్సవాలను ప్రారంభించారు. తొలి రోజు స్వామి వారికి విష్వక్సేన పుణ్యాహవాచనం, యాగశాల ప్రవేశం, అఖండ స్థాపన, అగ్ని ప్రతిష్ఠ, ధ్వజారోహణ కార్యక్రమాలను శాస్త్ర యుక్తంగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారికి విశేష పూజలు చేశారు. పూజా కార్యక్రమాల్లో పాల్గొన్న భక్తులకు అన్నదానం చేశారు.

ఘనంగా వీరాంజనేయుని పల్లకీ ఉత్సవం



జంపని(వేమూరు): మండలంలోని జంపని గ్రామంలో వేంచేసి యున్న శ్రీ వీరాంజనేయ స్వామి వారి దేవస్థానంలో నిర్వహించిన వార్షిక హనుమజ్జయంతి ఉత్సవాల్లో భాగంగా శని సువర్చలా సహిత వీరాంజనేయస్వామి వారి పల్లకీ ఉత్సవాన్ని శనివారం వైభవంగా నిర్వహించారు. వేద పారాయణ నడమ భక్తుల హరే రామ నామ సంకీర్తన మధ్య పల్లకీ ఉత్సవం అత్యంత వైభవంగా జరిగింది. సమ్మెట బసవేశ్వరరావు దంపతులు ఉత్సవాన్ని నిర్వహించారు. అర్చకులు శ్రీనివాస మూర్తి ఆలయ పల్లకీ ఉత్సవ విశిష్టతను భక్తులకు వివరించారు. మూల విరాట్ స్వరూప వీరాంజనేయ స్వామి వారికి సహస్ర అష్టోత్తర శత నామాలతో బాజ పూల అర్చన జరిపారు. ఈ కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

హిందీ పరీక్షకు 34 మంది గైర్హాజరు

రేపల్లె రూరల్: పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షలలో భాగంగా మండలంలోని పేటేరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రంలో శనివారం రెండో రోజు హిందీ పరీక్ష ప్రశాంతంగా జరిగింది. రేపల్లె పట్టణ, మండలం నుంచి 40 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కావాల్సి ఉండగా 6గురు మాత్రమే హాజరయ్యారు. 34 మంది గైర్హాజరైనట్లు పరీక్షా కేంద్రం సూపరింటెండెంట్ బాబూజీ తెలిపారు.

శాసనాలలో మన సంస్కృతి నిక్షిప్తం



నగరంపాలెం: శాసనాల అధ్యయనం ద్వారా మన భాష, సంస్కృతి, మూలాలు తెలుస్తాయని లేమల్లెపాడు ఎంటీఎస్ ఉపాధ్యాయుడు మోదుగుల రవికృష్ణ అన్నారు. స్థానిక సీనియర్ సిటిజన్స్ కార్యాలయ ఆవరణలో శనివారం అమరావతి అమరేశ్వరాలయ శాసనాల సంపుటి 'అమరేశ్వరం' పుస్తకావిష్కరణ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ సంపుటిలో ఉన్న 38 శాసనాల ద్వారా ఉమ్మడి గుంటూరు జిల్లాలో ఉండే పలు ప్రాంతాలు, వెయ్యేళ్ల కిందట ఉమ్మడి జిల్లా రాజులు, వారి ప్రతినిధులు, ఉద్యోగులు ఇచ్చిన దానాలు మొదలైన విషయాలన్నీ తేటతెల్లంగా తెలుస్తాయని అన్నారు.

హోంగార్డు కుటుంబానికి చేయూత



నగరంపాలెం: జిల్లాలో హోంగార్డు పని చేస్తున్న వై.అక్కేశ్వరరావు గతేడాది డిసెంబర్ 12న అనారోగ్యంతో మృతి చెందారు. జిల్లాలోని హోంగార్డుల ఒక రోజు వేతనం రూ.2.37 లక్షల చెక్కుని అతడి భార్య ప్రమీలకు శనివారం జిల్లా పోలీస్ కార్యాలయ ఆవరణలో ఎస్పీ తుషార్ డూడీ అందించారు. కార్యక్రమంలో హోంగార్డు ఆర్ఐ స్వర్ణలత, ఆర్ఎస్ఐ కృష్ణయ్య, ఏఎస్ఐ చంద్రశేఖర్, హోంగార్డ్ ఎస్సీటీ అధికారులు పాల్గొన్నారు.

సింగిల్ నంబరు లాటరీ ఆడుతున్న ముగ్గురు అరెస్టు

పట్నంబజారు: సింగిల్ నంబరు లాటరీ ఆడుతున్న ముగ్గురిని కొత్తపేట పోలీసులు అరెస్టు చేశారు. కొత్తపేటలోని ఓ ప్రాంతంలో సింగిల్ నంబరు లాటరీ ఆడుతున్న ముగ్గురిని అదుపులోకి తీసుకుని, వారి నుంచి రూ. 11,500 స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పరుస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

బాపట్ల జిల్లాలో చిరు జల్లులు

బాపట్లటౌన్: బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం ప్రభావంతో జిల్లాలో తేలిక పాటి వర్షాలు కురుస్తున్నాయి. శనివారం ఉదయం నుంచే ఆకాశం మేఘావృతమైంది. రేపల్లె, వేమూరు నియోజకవర్గంలో మోస్తరు వర్షం కురిసింది. బాపట్ల, పర్చూరు, చీరాల, అద్దంకి ప్రాంతాల్లో చిరుజల్లులు కురిశాయి. దీంతో వాతావరణం చల్లబడింది.

పశు పెంపకంలో సంరక్షణ తప్పనిసరి

భట్టిప్రోలు: మేలు జాతి పాడి పశువులు, జీవాల పెంపకం చేపట్టి అధిక ఉత్పత్తి సాధించినప్పుడే పశు పోషణ లాభదాయకంగా ఉంటుందని భట్టిప్రోలు పశు వైద్యురాలు బి.లక్ష్మీ రంజిత పేర్కొన్నారు. శనివారం ఆమె పశు వైద్య పరీక్షలు జరిపి రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మేలు జాతి పశు పోషణలో శాస్త్రీయ యాజమాన్య పద్ధతులు పాటిస్తూ వాటికి వచ్చే ఆరోగ్య సమస్యలను ఎప్పటికప్పుడు గమనిస్తూ ఉండాలన్నారు. వాతావరణ మార్పులు, అధిక ఉష్ణోగ్రతలు దృష్టిలో ఉంచుకుని జాగ్రత్తలు పాటించాలన్నారు. పశువులు, జీవాలు పెంపకందారులు అంటు వ్యాధులు నివారించడానికి ఎప్పటికప్పుడు జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు.

29న మున్సిపల్ సాధారణ సమావేశం

రేపల్లె రూరల్: పట్టణంలోని మున్సిపల్ సమావేశ మందిరంలో ఈ నెల 29న ఉదయం 11 గంటలకు మున్సిపల్ సాధారణ సమావేశం నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ శేషాద్రి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మున్సిపల్ చైర్‌పర్సన్ కట్టా మంగ అధ్యక్షతన నిర్వహించే సమావేశానికి కౌన్సిలర్‌లు, కోఆప్షన్ సభ్యులు, అధికారులు హాజరు కావాలని కోరారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత



మొక్కలు నాటుతున్న చల్లా రామయ్య

బాపట్లటౌన్: పర్యావరణ పరిరక్షణ మొక్కల పెంపకంతోనే సాధ్యమవుతుందని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ దివ్యాంగుల విభాగం జిల్లా అధ్యక్షుడు చల్లా రామయ్య తెలిపారు. మండలంలోని దివ్యాంగుల కాలనీలో శనివారం మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. చల్లా రామయ్య మాట్లాడుతూ ప్రస్తుతం సమాజంలో పెరిగిపోతున్న వాహనాల తాకిడిని తట్టుకుని పర్యావరణం కలుషితం కాకుండా ఉండాలంటే ప్రతి ఒక్కరు విరివిగా మొక్కలు పెంచాలన్నారు. ప్రస్తుతం వర్షాలు సమృద్ధిగా కురుస్తున్నాయని, మొక్కలు నాటేందుకు ఇదే మంచి తరుణమన్నారు. రోడ్ల కిరువైపులా మొక్కలు పెంచడం వలన కాలుష్యాన్ని నివారించగలమన్నారు. భవిష్యత్ తరాలకు మనం అందించే ఏకైక ఆస్తి కాలుష్య రహిత పర్యావరణమేనని అన్నారు. కార్యక్రమంలో దివ్యాంగుల సంఘం నాయకులు గుంజి ఏడుకొండలు, భోగిరెడ్డి శ్రీనివాసరెడ్డి, చల్లాపల్లి గోపి, షేక్ నీలిమా తదితరులు పాల్గొన్నారు.

నూతన జూనియర్ కళాశాలలో అడ్మిషన్లు ప్రారంభం



పేరలిలో నూతనంగా ఏర్పాటు చేసిన జూనియర్ కళాశాల

కర్లపాలెం: కర్లపాలెం మండలం పేరలిలో ప్రభుత్వం నూతనంగా ఏర్పాటు చేసిన జూనియర్ కళాశాలలో ఈ విద్యా సంవత్సరం నుంచి విద్యాబోధన ప్రారంభమవుతుందని ప్రస్తుతం అడ్మిషన్లు జరుగుతున్నాయని పేరలి కళాశాల ప్రిన్సిపాల్ యు.అపర్ణ, పాఠశాల అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు సలగల ధర్మేంద్ర తెలిపారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రాంగణంలోనే ఎమ్మెల్యే కోన రఘుపతి కృషితో కో ఎడ్యుకేషన్ జూనియర్ కళాశాలను ఏర్పాటు చేశారు. జూలై 1 నుంచి ఇంటర్ విద్యాబోధన ప్రారంభమవుతుందని ప్రిన్సిపాల్ తెలిపారు. ఈ కళాశాలలో ఎంపీసీ, బైపీసీ, సీఈసీ గ్రూపులలో ఇంగ్లీష్ మీడియంలో విద్యా బోధన జరుగుతుందని తెలిపారు. ఆహ్లాదకరమైన వాతావరణంలో అన్ని వసతులతో కూడిన నాణ్యమైన విద్యాబోధన అందించటం జరుగుతుందన్నారు. ప్రొజెక్టర్‌తో కూడిన స్మార్ట్ రూమ్ సదుపాయం, ఐఎఫ్‌పీఎస్‌తో విద్యాబోధన, విశాలమైన ఆటస్థలం, ప్రతి విద్యార్థిపై ప్రత్యేక శ్రద్ధ, పోషక విలువలతో కూడిన మధ్యాహ్న భోజన సౌకర్యాలు ఉన్నాయని తెలిపారు. పదో తరగతి రెగ్యులర్ విద్యార్థులతో పాటు ఓపెన్ టెన్త్ పాసైన వారు కూడా జూనియర్ కళాశాలలో చేరేందుకు అర్హులని ప్రధానోపాధ్యాయిని, ప్రిన్సిపాల్ యు.అపర్ణ తెలిపారు.

బాలుడి అదృశ్యం



గుంటూరు ఈస్ట్: బాలుడు కనిపించకుండా పోయిన ఘటనపై నగరపాలెం పోలీసులు కేసు నమోదు చేశారు. కృష్ణబాబు కాలనీకి చెందిన జానపాటి రమేష్ కుమారుడు అరుణ్ (16) శుక్రవారం ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. అతని ఆచూకీ కోసం వెతికిన కుటుంబ సభ్యులు కనిపించకుండా పోయినట్లు నిర్ధారించుకుని శనివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఫొటోలోని బాలుడ్ని గుర్తించిన వారు 8688831336 నంబరుకు సమాచారం ఇవ్వాలని కోరారు.

కాశీ విశ్వనాథుడికి చిన్నారుల నృత్యనీరాజనం

సంగీత నృత్యోత్సవంలో ప్రదర్శన



నృత్యోత్సవం అనంతరం అతిథులతో తెనాలి చిన్నారులు

తెనాలి: తెనాలి ప్రసిద్ధ పుణ్యక్షేత్రం కాశీలో శనివారం ఉదయం జరిగిన కాశీ విశ్వనాథుని సంగీత నృత్యోత్సవంలో తెనాలి చిన్నారులు కూచిపూడి నృత్యాంశాలతో అభినందనలు అందుకున్నారు. భారత్ ఆర్ట్స్ అకాడమీ, కాశీ విశ్వనాథ టెంపుల్ ట్రస్ట్ ఫ్యాకల్టీ ఆఫ్ పెర్ఫార్మెన్స్, బెనారస్, హిందూ యూనివర్సిటీ, వారణాసి సంయుక్త ఆధ్వర్యంలో ఈ సంగీత నృత్యోత్సవాన్ని ఏర్పాటుచేశారు. తెనాలికి చెందిన ప్రముఖ నృత్యగురువు డాక్టర్ చల్లా బాల త్రిపుర సుందరి శిష్యబృందం 21 మంది కాశీ విశ్వేశ్వర స్వామి సన్నిధిలో చక్కటి నృత్యాంశాలతో ఆ నటరాజుకి నృత్యాభిషేకం చేసుకున్నారు తొలుత బాల శిష్య బృందం అంబ ప్రార్థనతో ఆరంభించారు. మొదటి అంశంగా ఆనంద నర్తన గణపతి ప్రార్థనను అయిదుగురు విద్యార్థులు ప్రదర్శించారు. రెండో అంశంగా ఆనంద తాండవం అనే అంశంలో చలమలశెట్టి మహతి, సంస్కృతి, వలివేటి మౌక్తిక, తుమ్మల ప్రణతి యశస్విని. గీతికా షణ్ముఖ నర్తించారు. తదుపరి శివతాండవం, నాలుగో అంశంగా శివస్తుతి ప్రదర్శించారు. చివరగా డాక్టర్ చల్లా బాలా త్రిపుర సుందరి 'మహిషాసుర మర్దని' ప్రదర్శించి అందరి మన్ననలను పొందారు. ముఖ్యఅతిథులుగా కాశీ విశ్వనాథ టెంపుల్ ట్రస్ట్ సీఈవో విశ్వ భూషణ్ మిశ్రా, ట్రస్ట్ బోర్డ్ మెంబర్ డాక్టర్ బ్రిజ్‌భూషణ్ ఓఝా, బెనారస్ హిందూ యూనివర్సిటీ ప్రొఫెసర్ డాక్టర్ సంగీత పండిట్, యూనివర్సిటీ ఫెర్ఫార్మింగ్ ఆర్ట్స్ డీన్ ప్రొఫెసర్ శశికుమార్, తెలుగు డిపార్ట్‌మెంట్, అధిపతి డాక్టర్ బూదాటి వెంకటేశ్వర్లు, కాశీ విశ్వనాథ మందిర్ అర్చక్ డాక్టర్ శ్రీకాంత్ మిశ్రా, ప్రముఖ సంగీత విద్వాంసురాలు/ వ్యవసాయ శాస్త్రవేత్త డాక్టర్ సుచిత్ర హొల్లా హాజరయ్యారు. నృత్యగురువు బాలత్రిపురసుందరికి 'మంజీర నాట్యం' అవార్డును ప్రదానం చేసి, శిష్యబృందాన్ని జ్ఞాపికలు, సర్టిఫికెట్లతో సత్కరించారు.

నేడు క్రికెట్ సెలక్షన్స్

తెనాలిరూరల్: ఏపీ యూత్ టీ–20 క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం క్రికెట్ జట్టు ఎంపిక జరుగుతుందని అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఎంఎస్ భాస్కర్‌గౌడ్ శనివారం తెలిపారు. పట్టణ చెంచుపేటలోని ఆర్‌పీఎం క్లబ్‌లో యువ క్రికెట్ అకాడమీ ఆధ్వర్యంలో క్రీడాకారులను ఎంపిక చేస్తారని, ఎంపికైన జట్టు వచ్చే నెల 8, 9 తేదీల్లో జరుగనున్న నేషనల్ క్యాష్ ప్రైజ్ చాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొంటుందన్నారు. ఆసక్తి ఉన్న వారు 7989215572 నంబరులో సంప్రదించాలన్నారు.

నేత్రానందంగా ఆలయ వార్షికోత్సవ పూజలు



కర్లపాలెం: మండల పరిధిలోని నల్లమోతువారి పాలెం పంచాయతీ గౌడపాలెం గ్రామంలో శ్రీ సీతారామచంద్ర స్వామి ఆలయ ద్వితీయ వార్షికోత్సవ పూజలు శనివారం ఘనంగా నిర్వహించారు. గ్రామపెద్దలు, ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో ఆలయ అర్చకులు రమాకాంత్ శర్మ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం సుప్రభాత సేవ, పంచామృతాల అభిషేకాలు, పంచసూక్త సహిత రామ గాయత్రీ, పూర్ణాహుతి పూజలు చేసి సీతారాముల శాంతి కల్యాణం నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్న సంతర్పణ చేశారు.

శాంతి భద్రతలకు భంగం కలిగిస్తే కఠిన చర్యలు



గుంటూరు రూరల్: పోలీస్ స్టేషన్ పరిధిలో రౌడీషీటర్ల కదలికలపై అనునిత్యం నిఘా ఉంటుందని చట్ట వ్యతిరేక చర్యలకు పాల్పడితే వారిపై కఠినంగా చర్యలు తీసుకుంటామని నల్లపాడు పోలీస్ స్టేషన్ సీఐ నరేష్‌కుమార్ తెలిపారు. శనివారం అడవి తక్కెళ్ళపాడులోని నల్లపాడు పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సార్వత్రిక ఎన్నికల ఫలితాల విడుదల రోజు జూన్ 4వ తేదీతో పాటు ఆ తరువాత రోజుల్లో ఎవరైనా రౌడీషీటర్‌లు ప్రజా శాంతికి భంగం కలిగించే కార్యక్రమాలకు పాల్పడితే వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. రాష్ట్ర, జిల్లా అధికారుల ఆదేశాలతో రౌడీ షీటర్లకు ప్రత్యేక కౌన్సిలింగ్ నిర్వహించటం జరిగిందన్నారు. చట్ట ఉల్లంఘనకు పాల్పడితే అటువంటి వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు రౌడీషీటర్‌ల కదలికలపై నిఘా ఎప్పటికప్పుడు ఉంటుందనే విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు. వారి ప్రవర్తన ఇతరులకు ఇబ్బంది లేకుండా చూసుకోవాలని తెలిపారు. రాబోయే రోజుల్లో నల్లపాడు పోలీస్ స్టేషన్ పరిధిలో ప్రశాంత వాతావరణం ఉండాలని ఎవరైనా దాన్ని అతిక్రమిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. కౌంటింగ్ పూర్తయిన తరువాత ఎక్కడైనా రౌడీషీటర్‌ల కదలికలు కనిపిస్తే సహించేది లేదని హెచ్చరించారు.

విధి నిర్వహణలో అలసత్వం వద్దు



మాట్లాడుతున్న ఎంపీపీ లలిత కుమారి

భట్టిప్రోలు: వైద్య ఆరోగ్య సిబ్బంది విధి నిర్వహణలో అలసత్వం వహిస్తే సహించేది లేదని ఎంపీపీ దావూరి వెంకట లలిత కుమారి అన్నారు. శనివారం భట్టిప్రోలు మండల పరిషత్ కార్యాలయంలో సర్వసభ్య సమావేశం ఎంపీడీవో జేబీవీ మల్లికార్జునరావు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఎంపీపీ లలిత కుమారి మాట్లాడుతూ సిబ్బంది రాత్రి పూట విధించే డ్యూటీలలో తప్పని సరిగా ఉండాలని పేర్కొన్నారు. వైద్యశాలలకు వచ్చే రోగుల పట్ల ఆప్యాయతతో మెలిగి చిత్తశుద్ధితో పని చేయాలని కోరారు. అప్పుడే ప్రభుత్వ వైద్యశాలల పట్ల ప్రజలకు నమ్మకం కలుగుతుందన్నారు. వైద్యులు వచ్చామా.. సంతకం పెట్టామా.. వెళ్లామా అన్న రీతిలో కాకుండా తీసుకుంటున్న జీతానికి సార్థకత చేకూర్చేలా పని చేయాలని కోరారు. మండలంలో చేపట్టిన నాడు-నేడు పనులను వెంటనే పూర్తి చేయాలని విద్యాశాఖాధికారులను ఆదేశించారు. మండలంలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని కోరారు. అధికారులు, ప్రజా ప్రతినిధులు సమన్వయంతో పని చేస్తేనే సమస్యలు పరిష్కారమవుతాయని అన్నారు. మొత్తం మీద సమావేశం సాదా సీదాగా జరిగింది. సమావేశంలో జెడ్పీటీసీ సభ్యురాలు తిరువీధుల ఉదయభాస్కరి, వైస్ ఎంపీపీ మల్లోలు ఉషారాణి, పలువురు ఎంపీటీసీలు, సర్పంచులు, అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఏజెంట్ల వివరాలు నెలాఖరులోగా ఇవ్వాలి

ఆర్‌ఓ కీర్తి చేకూరి



సమావేశంలో మాట్లాడుతున్న తూర్పు నియోజకవర్గ ఆర్‌ఓ కీర్తి చేకూరి

నెహ్రూనగర్: సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపు,కు హాజరయ్యే ఏజెంట్ల వివరాలు ఈనెల 31లోపు రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో అందించాలని తూర్పు నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, నగర కమిషనర్ కీర్తి చేకూరి ఎన్నికల్లో పోటీ చేసిన అభ్యర్థులకు తెలిపారు. శనివారం నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలోని రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో జూన్ 4 జరగనున్న ఓట్ల లెక్కింపుపై గుంటూరు తూర్పు నియోజకవర్గంలో పోటీ చేసిన అభ్యర్థులు, ఏజెంట్లతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జూన్ 4న ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపు జరుగుతుందని, సజావుగా జరగడానికి అభ్యర్థులు, ఏజెంట్లు సహకరించాలని ఆమె కోరారు. లెక్కింపు కేంద్రానికి హాజరయ్యే ఏజెంట్ల వివరాలను ఈ నెల 31లోపు రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో వివరాలు ఇవ్వాలని సూచించారు. ఏజెంట్లు తప్పనిసరిగా ఎన్నికల సంఘం నిబంధనలు పాటించాలని, గుర్తింపు కార్డ్ తెచ్చుకోవాలని ఆమె తెలిపారు. లెక్కింపు కేంద్రంలోకి సెల్ ఫోన్ అనుమతి ఉండదని, కేంద్రం పరిసరాల్లో ఏర్పాటు చేసిన కేంద్రంలో దాన్ని డిపాజిట్ చేయాలని చెప్పారు. జూన్ 3న ఆర్‌ఓ కార్యాలయంలోని స్ట్రాంగ్ రూమ్‌లో భద్రపరిచిన పోస్టల్ బ్యాలెట్ ఓట్లను యూనివర్సిటీలోని స్ట్రాంగ్ రూమ్‌కి తరలిస్తామన్నారు. 4వ తేదీ ఉదయం 5 గంటలకు లెక్కింపు సిబ్బందిని టేబుల్స్ వారీగా ర్యాండమైజేషన్ మేరకు కేటాయింపు జరుగుతుందని పేర్కొన్నారు. అభ్యర్థులు, ఏజెంట్లు ఆ సమయానికి రావచ్చని, 6 గంటలకు స్ట్రాంగ్ రూమ్ ఓపెన్ చేస్తామని తెలిపారు. ఉదయం 8 గంటలకు పోస్టల్ బ్యాలెట్, 8:30 గంటలకు ఈవీఎంల లెక్కింపు ప్రారంభమవుతుందని వివరించారు. కేంద్రంలో ఈవీఎంల లెక్కింపునకు 14, పోస్టల్ బ్యాలెట్ లెక్కింపునకు నాలుగు టేబుల్స్ ఏర్పాటు చేశామని చెప్పారు. లెక్కింపు ప్రక్రియ అంతా సీసీ కెమెరాల ద్వారా రికార్డ్ చేయనున్నట్లు వెల్లడించారు. సమావేశంలో ఏఆర్‌ఓలు వెంకటలక్ష్మి, ప్రదీప్ కుమార్, భీమరాజు, సూపరింటెండెంట్ పద్మనాభరావు, తూర్పు నియోజకవర్గంలో పోటీ చేసిన అభ్యర్థులు, ఏజెంట్లు పాల్గొన్నారు.

ప్రభుత్వ వైన్ షాపులో రూ. 1.50లక్షల చోరీ

మంగళగిరి: పట్టణంలోని జాతీయ రహదారి వెంట గల ప్రభుత్వ వైన్ షాపులో నగదు చోరీ జరిగిన ఘటన శుక్రవారం రాత్రి జరిగింది. పట్టణ సీఐ పి.శ్రీనివాసరావు తెలిపిన వివరాల ప్రకారం... కొప్పురావూరుకాలనీ జాతీయ రహదారి వెంటగల ప్రభుత్వ వైన్‌షాపులో సిబ్బంది శుక్రవారం రాత్రి వరకు విక్రయించగా వచ్చిన రూ. 1.50లక్షలను కౌంటర్‌లో ఉంచి తాళాలు వేసి వెళ్లారు. శనివారం మరలా తెరిచేందుకు రాగా షట్టర్ల తాళాలు పగులగొట్టి ఉన్నాయి. కౌంటర్‌లోని నగదు కూడా మాయమైంది. దీంతో పట్టణ పోలీస్ స్టేషన్‌లో షాపు సూపర్‌వైజర్ నక్కా గోపి ఫిర్యాదు చేశారు.

ఘనంగా సాయిశృతి అకాడమీ వార్షికోత్సవం



నగరంపాలెం: స్థానిక బృందావన్ గార్డెన్స్ పద్మావతి కళావేదికపై శనివారం సాయంత్రం సాయిశృతి మ్యూజిక్ అకాడమీ 37వ వార్షికోత్సవాన్ని నిర్వహించారు. వ్యవస్థాపకులు ప్రేమ్‌కుమార్ శిష్య బృందం వోకల్, వీణా, వేణువు, మాండోలిన్, తబల, డోలక్, కీబోర్డు, హార్మోనియం, వయోలిన్, గిటార్, డ్రమ్స్ తదితర వాయిద్యాలతో ప్రతిభను చాటారు. కార్యక్రమానికి ఆలయ కమిటీ అధ్యక్షులు సీహెచ్. మస్తానయ్య, సహాయ కార్యదర్శి ఊటుకూరి నాగేశ్వరరావు జ్యోతి ప్రజ్వలన చేయగా, వల్లూరి కృష్ణకిశోర్ వ్యాఖ్యాతగా వ్యవహరించారు.